క్లుప్తంగా

లక్ష్మీగణపతికి పంచామృతాభిషేకం



స్వామి వారి అలంకారం

గోపాలపురం: సంకటహర చతుర్థి సందర్భంగా బుధవారం స్థానిక రాజరాజేశ్వరి టౌన్‌షిప్‌లోని లక్ష్మీగణపతి ఆలయంలో పంచామృతాభిషేకం, అర్చన నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీగణపతి వారికి ప్రత్యేక అలంకరణ చేసినట్టు ప్రధానార్చకుడు గౌతంశర్మ తెలిపారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. నూతనంగా నిర్మించిన లక్ష్మీగణపతి ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

'రవళి' స్పిన్నింగ్ మిల్లుకు ఇంధన పొదుపు అవార్డు

పెరవలి: విద్యుత్ వినియోగం, ఇంధన సంరక్షణలో పొదుపు పాటించినందుకు ఖండవల్లిలోని రవళి స్పిన్నింగ్ మిల్లుకు ప్రభుత్వం టెక్స్‌టైల్స్ విభాగంలో సిల్వర్ మెడల్ ప్రకటించింది. ఈ విషయాన్ని ఆ సంస్థ జనరల్ మేనేజర్ ఈశ్వరన్ బుధవారం తెలిపారు. రూఫ్ టాప్ సోలార్, విండ్ మిల్స్ ద్వారా సాంప్రదాయేతర విద్యుత్‌ను ఉత్పత్తి చేసి, ప్రభుత్వ విద్యుత్‌ను తక్కువగా వినియోగించుకున్నందుకు తమ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం ఈ అవార్డును ప్రకటించిందన్నారు. విజయవాడలో ఈ నెల 20న నిర్వహించే కార్యక్రమంలో రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి చేతుల మీదుగా ఈ అవార్డును రవళి సంస్థ వైస్ చైర్‌పర్సన్ వంక రవళి అందుకోనున్నారని తెలిపారు. రవళికి అవార్డు రావడం ఎంతో ఆనందంగా ఉందంటూ ఎమ్మెల్సీ వంక రవీంద్ర, స్థానికులు, కార్మికులు, పలు రాజకీయ పార్టీల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

మద్యం షాపుల్లో రిజిస్టర్లపై ఫిర్యాదు

తాళ్లపూడి: మండలంలోని మద్యం షాపుల్లో బిల్లులు ఇవ్వడం లేదని, ఇతర నిబంధనలు పాటించడం లేదని కొవ్వూరు ఎక్సైజ్ సీఐకి ఫిర్యాదు చేశామని తాళ్లపూడికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు నామన బుజ్జి తెలిపారు. తాళ్లపూడి షాపులో తాను ఒక మద్యం ఫుల్ బాటిల్ కొనుగోలు చేస్తే రూ.100 ఎక్కువగా తీసుకున్నారన్నారు. తాను బిల్లు ఇవ్వాలని అడిగినా ఇవ్వలేదని తెలిపారు. రెండు నెలలు కావస్తున్నా మద్యం షాపుల్లో బిల్లు బుక్స్, స్టాక్ రిజిస్టర్లు నిర్వహించడం లేదని ఫిర్యాదు చేసినట్టు పేర్కొన్నారు.


పేదలకు దుప్పట్ల పంపిణీ



గోపాలపురంలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు లలిత

గోపాలపురం: రక్షణ సేవాసమితి ఆధ్వర్యంలో బుధవారం గోపాలపురంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 200 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత హాజరయ్యారు. రక్షణ సేవా సమితి చేపడుతున్న సేవా కార్యక్రమాలను ఆమె అభినందించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు గెల్లా ఎలీషా, కొలుకుల జాషువా, ఏసురాజు, రామారావు, రత్నరాజు రక్షణసేవాసమితి పాస్టర్లు, దైవజనులు పాల్గొన్నారు.

కోటసత్తెమ్మకు సారె సమర్పణ



సారె తీసుకు వస్తున్న రాజమహేంద్రవరానికి చెందిన 101 మంది మహిళలు

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెంలో కొలువైన కోటసత్తెమ్మ వారి తిరునాళ్లకు నాలుగో రోజైన బుధవారం భక్తులు పోటెత్తారు. అఖిల తెలుగుసేన రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు జి.ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం నుంచి 101 మంది మహిళలు చీర, సారె, కలశాలు, బోనాలతో వచ్చి అమ్మవారికి పసుపు, కుంకుమ సమర్పించారు. ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్యప్రకాశ్ పర్యవేక్షణలో కోటసత్తెమ్మ వారిని ప్రత్యేకంగా అలంకరించి కుంకుమ పూజలు, హోమాలు, చండీ పారాయణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్, చైర్మన్ దేవులపల్లి రవిశంకర్, ప్రధానార్చకుడు అప్పారావు శర్మ, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో పోషణ వాటికలు

- ప్రతి కేంద్రం వద్దా 6 సెంట్లలో సేంద్రియ పద్ధతిలో ఆకుకూరలు, కూరగాయల సాగు
- గర్భిణులు, బాలింతలకు ఉచితంగా పంపిణీ
- గోపాలపురం ప్రాజెక్టు పరిధిలో 172 వాటికల ఏర్పాటు
- రూ. 17.20 లక్షల విడుదల



గౌరీపట్నం అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలోని పోషణ వాటికలో పెంచిన ఆకుకూరలు



గౌరీపట్నంలో గర్భిణులకు ఆకుకూరలు పంపిణీ చేస్తున్న ఐసీడీఎస్ అధికారులు

దేవరపల్లి: గ్రామీణ ప్రాంతాల్లోని గర్భవతులు, బాలింతలకు రసాయన ఎరువులు, పురుగు మందుల అవశేషాలు లేని పోషక పదార్థాలు అందించాలనే ఉద్దేశంతో అంగన్‌వాడీ కేంద్రాల వద్ద పోషణ వాటికలను ఏర్పాటు చేసి ఆకుకూరలు, కూరగాయలు పండిస్తున్నారు. వాటికలో పండించిన ఆకుకూరలు, కూరగాయలను ఆయా కేంద్రాల పరిధిలోని గర్భవతులు, బాలింతలకు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు వంట చేసి పెడుతున్నారు. సేంద్రియ ఎరువులు వినియోగించి ఈ ఆకుకూరలు, కూరగాయలు పండిస్తున్నారు. 2024–25 సంవత్సరానికి అవసరమైన ఆకుకూరలు, కాయగూరల సాగుకు ఐసీడీఎస్ అధికారులు శ్రీకారం చుట్టారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో ఆరు సెంట్లకు తగ్గకుండా భూమిని ప్రభుత్వం లేదా ప్రైవేట్ వ్యక్తుల సహకారంతో సేకరిస్తారు. ఆ భూమిలో మడులు కట్టి వివిధ రకాల ఆకుకూరలు, కాయగూరలు పండిస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో ప్రథమంగా దేవరపల్లి మండలం గౌరీపట్నంలో ఏడు సెంట్ల విస్తీర్ణంలో ఆకుకూరలు, కాయగూరలు పండించారు. ఈ గ్రామంలో ఏడు అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఆకుకూరలు సిద్ధం కావడంతో గర్భవతులు, బాలింతలకు పంపిణీ చేస్తున్నారు.

పోషణ వాటికల ఏర్పాటు

గోపాలపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల మండలాల్లో 234 అంగన్‌వాడీ కేంద్రాలుండగా, వాటిలో 172 కేంద్రాలకు సొంత భవనాలు ఉన్నాయి. సొంత భవనాలు గల కేంద్రాలకు పోషణ వాటిక ఏర్పాటు చేసి ఆ గ్రామంలోని అన్ని కేంద్రాల పరిధిలోని బాలింతలు, గర్భవతులకు పండించిన ఉత్పత్తులను పంపిణీ చేస్తారు. 172 కేంద్రాల పరిధిలో సుమారు 10 ఎకరాల్లో పంటలను సాగు చేస్తున్నారు.

ఒక్కో కేంద్రానికి రూ.10 వేల చొప్పున..

పోషణ వాటికల ఏర్పాటుకు ప్రభుత్వం ఒక్కొక్క అంగన్‌వాడీ కేంద్రానికి రూ.10 వేల చొప్పున నిధులు విడుదల చేసింది. ఈ నిధులతో విత్తనాల కొనుగోలు, వాటికల తయారీ, నీటి సదుపాయం వంటి వాటిని అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహకులు సమకూర్చుకోవాలి. పండించిన పంటలను ఉచితంగా బాలింతలు, గర్భవతులకు పంపిణీ చేయడంతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు వండి పెట్టాలి. పూర్తిగా సేంద్రియ పద్ధతిలో పంటలు పండించాలి. వాటికల ఏర్పాటు కోసం ప్రభుత్వం అంగన్‌వాడీకేంద్రాల సమీపంలోని ప్రభుత్వ భూములను, డంపింగ్ యార్డులను కేటాయించింది. ప్రభుత్వ భూములు అందుబాటులో లేని గ్రామాల్లో రైతులు, ప్రజాప్రతినిధుల సహకారంతో స్థలాలను తీసుకుని పంటలు సాగు చేస్తున్నారు.

ఇవీ సాగు చేస్తున్న పంటలు

కొత్తమీర, గోంగూర, పాలకూర, చుక్కకూర, మెంతికూర, తోటకూర, వంగ, టమాటా, బీర, దోస, గోరుచిక్కుడు, ఆనబ, గుమ్మడి, బీర వంటి పంటలను పండిస్తున్నట్టు ఐసీడీఎస్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఆకుకూరలు సిద్ధంగా ఉన్నాయి. దేవరపల్లి మండలంలో 52, నల్లజర్ల మండలంలో 63, గోపాలపురం మండలంలో 57 పోషణ వాటికలు ఏర్పాటు చేశారు. ఐసీడీస్ సూపర్‌వైజర్లు వాటికలను పర్యవేక్షిస్తున్నారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారుల సూచనలు, సలహాలను తీసుకుని పంటలను పండిస్తున్నట్టు సూపర్‌వైజర్ శశికళ తెలిపారు.

సేంద్రియ పద్ధతిలో..



"రసాయన, క్రిమిసంహారక మందులు వాడకుండా పూర్తిగా సేంద్రియ ఎరువులను వినియోగించి ఆకుకూరలు, కాయకూరలు పండిస్తున్నాం. ప్రతి పోషణ వాటికకు ప్రభుత్వం రూ. 10 వేలు మంజూరు చేసింది. ప్రాజెక్టు పరిధిలో 172 కేంద్రాలకు రూ.17.20 కోట్లు మంజూరు కాగా పోషణ వాటికలను ఏర్పాటు చేశాం. బాలింతలు, గర్భవతులకు ఉచితంగా పంపిణీ చేస్తాం. జిల్లాలో ప్రప్రథమంగా గౌరీపట్నంలో ఆకుకూరలు పంపిణీ చేశాం. సుమారు 10 ఎకరాల్లో పంటల సాగు జరుగుతోంది."

– కె. నాగలక్ష్మి, సీడీపీఓ, గోపాలపురం

పూరి గుడిసెకు ముత్యాలమ్మ వారు

ఉండ్రాజవరం: జాతర మహోత్సవంలో భాగంగా కె.సావరం గ్రామంలోని ముత్యాలమ్మ వారిని బుధవారం నడివీధిలోని పూరిగుడిసె వద్దకు తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా వాయిద్యాల సందడిలో వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అమ్మవారికి నైవేద్యాలు చెల్లించారు. ఆడపడుచులు, పరిసర గ్రామాల నంచి వచ్చిన భక్తులతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. జనవరి 13 నుంచి 15 వరకూ జాతర మహోత్సవం నిర్వహించడానికి జాతర కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

గ్రామాల్లో జరిగే కార్యక్రమాలపై దృష్టి పెట్టండి

తాళ్లపూడి: గ్రామాల్లో జరిగే వివిధ కార్యక్రమాలపై సచివాలయ మహిళా పోలీసులు దృష్టి సారించారని, అవసరమైన వాటిని తన దృష్టికి తీసుకురావాలని తాళ్లపూడి ఎస్సై టి.రామకృష్ణ సూచించారు. మండలంలోని సచివాలయ మహిళా పోలీసులతో బుధవారం స్థానిక తాళ్లపూడి పోలీస్‌స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. ఎస్సై రామకృష్ణ మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహించే ఆధ్యాత్మిక కార్యక్రమాలపై ముందుగానే పోలీసులకు సమాచారం ఉంటే తగిన జాగ్రత్తలు చేపట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. రానున్న సంక్రాంతి సందర్భంగా పేకాట, కోడి పందేలు నిర్వహించే అవకాశం ఉన్నందున వాటిపై కూడా సమాచారం సేకరించాలని ఎస్సై సూచించారు.

కొవ్వూరు మండలానికి రూ.2.49 కోట్ల మిగులు బడ్జెట్

- ఆమోదించిన మండల పరిషత్ సమావేశం
- 21 పనులకు రూ.57.90 లక్షల కేటాయింపు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నారాయుడు

కొవ్వూరు: మండల పరిషత్ బడ్జెట్‌ను ఎంపీపీ కాకర్ల నారాయుడు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన పాలకవర్గ సమావేశం ఆమోదించింది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి రూ.2,49,71,050 ముగింపు ఉంటుందని బడ్జెట్‌లో పేర్కొన్నారు. దీనికి అన్ని రకాల గ్రాంటులతో కలిపి అంచనా బడ్జెట్‌లో ఆదాయ, వ్యయాలను మినహాయిస్తారు. వివిధ సీనరేజీ ఆదాయం, స్టాంపు డ్యూటీ, తలసరి ఆదాయం కలపి మండలానికి రూ.48.52 లక్షల ఆదాయం సమకూరుతుందని పేర్కొన్నారు. 2024–25 సంవత్సర సవరణ అంచనాలు, 2025–26 సంవత్సరపు బడ్జెట్ అంచనాల ఆధారంగా మండల పరిషత్ సంక్షిప్త బడ్జెట్ నివేదికను ఎంపీడీవో సుశీల ప్రకటించారు. వివిధ పద్దుల కింద 2024 ఏప్రిల్ ఒకటో తేదీ నాటికి మండల పరిషత్ రాబడి రూ.1,63,10,591 గా ఉందన్నారు. 2025–26 సంవత్సరపు బడ్జెట్ అంచనాలు గత బడ్జెట్ నాటికి రూ.3,30,61,976 ప్రారంభ నిల్వగా ఉంది. వచ్చే ఆర్థిక సంవత్సరం రాబోయే గ్రాంటులు కలిపి రూ.63,96,06,545లుగా ఆశించి మొత్తం రూ.67,26,68, 521లు ఆదాయంగా ఆశించామన్నారు. దీనిలో రూ.64,76,97,471లు ఖర్చవుతుందని అంచనా వేయగా రూ.2,49,71,050 ముగింపు నిల్వగా చూపించామన్నారు.

అభివృద్ధి పనులకు ఆమోదం

మండల పరిషత్ సాధారణ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.57.90 లక్షలతో 21 పనులు చేపట్టనున్నట్టు ఎంపీపీ కాకర్ల నారా యుడు తెలిపారు. ఈ నిధులతో మండలంలోని దొమ్మేరు, సీతంపేట, కుమారదేవం గ్రామాల్లో సిమెంట్ డ్రెయిన్లు, రోడ్ల నిర్మాణాలు చేపట్టనున్నట్టు ఎంపీపీ ప్రకటించారు. మండలంలోని వివిధ శాఖల అధికారులు తమ పరిధిలో చేపడుతున్న పనులు, శాఖల పురోగతి, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వివరాల గురించి సభ్యులను వివరించారు. అనంతరం ఎంపీడీవో కె.సుశీల 2025–26 సంవత్సరం బడ్జెట్‌ను సమావేశంలో ప్రవేశపెట్టారు. వైస్ ఎంపీపీ వీరమళ్ల నారాయుడు, జెడ్పీటీసీ సభ్యురాలు బొంతా వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీకి 'పశ్చిమ' జట్టు పయనం



రాష్ట్ర మహిళా క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జట్టు

దేవరపల్లి: ఉమ్మడి పశ్చిమగోదావరి మహిళా క్రికెట్ జట్టుకు దేవరపల్లిలోని ఏఎస్సార్ జెడ్పీ హైస్కూల్లో మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ బుధవారం సాయంత్రంతో ముగిసింది.ఈ జట్టు ఈ నెల 20,21,22 తేదీల్లో మచిలీపట్నంలో నిర్వహించే రాష్ట్రస్థాయి మహిళా క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు ఇక్కడి నుంచి బయలుదేరి వెళ్లింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జట్టులోని 16 మంది క్రీడాకారిణుల్లో 13 మంది మండలంలోని దేవరపల్లి, దుద్దుకూరు, పల్లంట్ల, యాదవోలు జెడ్పీ హైస్కూళ్లకు చెందిన వారేనని స్థానిక ఏఎస్సార్ జెడ్పీ హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ ఓరుగంటి నాగరాజు తెలిపారు. క్రీడాకారిణులకు ప్రయాణ ఖర్చులు, క్రీడా దుస్తులకు జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డి. సువర్ణరాజు, పార్టీ శ్రేణులు రూ. 10 వేల ఆర్థికసాయం అందజేసినట్టు తెలిపారు.

బాక్సింగ్ పోటీల్లో రవికి బంగారు పతకం



రవిని విజేతగా ప్రకటిస్తున్న అంపైర్

నిడదవోలు: అంతర్ విశ్వవిద్యాలయాల బాక్సింగ్ పోటీలకు స్థానిక ఎస్వీఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీకాం సెకండియర్ విద్యార్థి ఎం.రవి ఎంపికైనట్టు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఓ. జ్యోతి బుధవారం తెలిపారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలోని అంతర్ కళాశాలల బాక్సింగ్ పోటీలు రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. స్థానిక ఎస్వీఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల తరపున ఈ పోటీల్లో పాల్గొన్న ఎం.రవి 51 కేజీల విభాగంలో సత్తా చాటి ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించాడు. ఈ క్రమంలో పంజాబ్‌లోని గురుకాశి విశ్వవిద్యాలయంలో త్వరలో నిర్వహించే అంతర్ విశ్వవిద్యాలయాల బాక్సింగ్ పోటీలకు ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం తరపున రవి ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ జ్యోతి చెప్పారు. రవిని బుధవారం ప్రిన్సిపాల్ జ్యోతి, ఫిజికల్ డైరెక్టర్ సీహెచ్ సుబ్బారావు, అధ్యాపకులు అభినందించారు.

భూ సమస్యల ప్రక్షాళనకే రెవెన్యూ సదస్సులు

- జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు
- ఖండవల్లితో సహా పలు గ్రామాల సదస్సులకు భారీగా అర్జీలు



ఖండవల్లి రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు

పెరవలి: భూ సమస్యల ప్రక్షాళనకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని, రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు సూచించారు. మండలంలోని ఖండవల్లి గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ నాగరాజు అధ్యక్షతన బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు మాట్లాడుతూ భూముల ఆన్‌లైన్ చేయించుకునేందుకు, కొత్త పాస్ పుస్తకాల కోసం, భూమి విస్తీర్ణంలో వ్యత్యాసాన్ని సరి చేసేందుకు రైతులు ఈ సదస్సుల్లో అర్జీలు అందజేస్తే నిర్ణీత గడువులోగా రెవెన్యూ అధికారులు పరిష్కరిస్తారన్నారు.

ఈ సదస్సులో రైతుల నుంచి 42 అర్జీలు అందాయి. వాటిలో భూముల ఆన్‌లైన్ గురించి 27, డంపింగ్ యార్డు గురించి ఒకటి, రేషన్ కార్డుల గురించి 3, శ్మశానవాటిక గురించి ఒకటి, భూ సమస్యల గురించి 10 అర్జీలు వచ్చాయని వివరించారు. సదస్సులో తహసీల్దార్ డి.అచ్యుత కుమారి, ఆర్ఐ పావని, ఎంపీటీసీ సభ్యులు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రవివర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అర్జీకి రసీదు ఇవ్వాలి

నిడదవోలు రూరల్: రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ప్రతి అర్జీకి కచ్చితంగా రసీదు ఇవ్వాలని మండల ప్రత్యేకాధికారి ఎ.దుర్గేష్ అధికారులను ఆదేశించారు. కోరుమామిడిలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. 'సాక్షి'లో ఈనెల 18న 'పరిష్కారం పరిహాసమే..!' అనే శీర్షికన ప్రచురించిన కథనానికి ఆయన స్పందించారు. గ్రామాల్లో వచ్చిన రెవెన్యూ సమస్యలను వెంటనే పరిష్కరించేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని దుర్గేష్ సూచించారు. కోరుమామిడిలో 31 వినతులు వచ్చినట్టు తహసీల్దార్ బి.నాగరాజు నాయక్ తెలిపారు. ఎంపీడీఓ డి.లక్ష్మీనారాయణ, డీటీ బి.ప్రదీప్‌కుమార్, ఆర్ఐ సత్యేంద్ర, వీఆర్వో దుర్గారావు పాల్గొన్నారు.

చాగల్లు: మండలంలో చిక్కాల గ్రామంలో బుధవారం తహసీల్దార్ ఎం.మెరికమ్మ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సమస్యలపై 13 అర్జీలను ప్రజల నుంచి ఆమె స్వీకరించారు.కార్యక్రమంలో ఎంపీడీవో ఎ.శ్రీదేవి, సర్పంచ్ కొయ్యే మణి, ఎంపీటీసీ సభ్యుడు పిల్లి తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి అమిత్ షా క్షమాపణ చెప్పాలి

కొవ్వూరు: డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై పార్లమెంట్ సాక్షిగా కేంద్ర హోం మంత్రి అమిత్‌షా మాట్లాడిన విధానం దుర్మార్గమని మాల సంఘాల జేఏసీ కన్వీనర్ బొంతా శ్యామ్ రవిప్రకాశ్ పేర్కొన్నారు. తక్షణమే అమిత్ షా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలు అమిత్‌షా అహంకారానికి నిదర్శనం అన్నారు. తక్షణ క్షమాపణ చెప్పకపోతే దేశ వ్యాప్తంగా ఉద్యమం చేపట్టాల్సి ఉంటుందన్నారు. మరో ప్రకటనలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు అంబేద్కర్‌ను ఉద్దేశిస్తూ అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.

వెన్నెముక వ్యాధులపై అవగాహన అవసరం

నిడదవోలు రూరల్: వెన్నెముక సంబంధిత వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని రాజమహేంద్రవరం వేద హాస్పిటల్స్ వెన్నెముక వైద్య నిపుణుడు తేజో ఫణీంద్ర సూచించారు. నిడదవోలు డివిజన్ కమ్యూనిటీ పారా మెడిక్స్, ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశాన్ని బుధవారం తిమ్మరాజుపాలెం హోటల్ ఆనంద్ ఇన్‌లో నిర్వహించారు. డాక్టర్ తేజో ఫణీంద్ర వెన్నెముకలో లుంబార సమస్య, క్యాన్సర్ వంటి వ్యాధులపై, గైనకాలజిస్ట్ డాక్టర్ లక్ష్మీ మృదుల స్త్రీల సంబంధిత వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు వి.ప్రసాద్, పీవీపీ సత్యనారాయణ, పీడీ శంకరం, పండు, బి.కృష్ణ, వీర వెంకట్రావు, ఎ.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆరు నెలలుగా స్టాంపుల కొరత

కొవ్వూరు: స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గత ఆరు నెలలుగా కోర్టు ఫీజు స్టాంపుల కొరత ఏర్పడింది. రూ.1, 2, 5,10, 20, విలువైన నాన్ స్టాంపు డ్యూటీ స్టాంపులు రూ.10, 20, 50, 100 కొరత వల్ల కక్షిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణంలోని మునిసిపల్ కోర్టు, సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి కోర్టులతో పాటు నిడదవోలు, జంగారెడ్డిగూడెం, గోపాలపురం, కొయ్యలగూడెం, పోలవరం మండలాల పరిధిలోని కక్షిదారులు ఇబ్బందులు చవి చూస్తున్నారని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాగంటి చలపతిరావు సబ్ రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేశారు. రోజూ కోర్టులో నోటరీ అఫిడవిట్లకు స్టాంపుల అవసరం ఎంతో ఉందని పేర్కొన్నారు.స్టాంపుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎస్టీయూ మండల శాఖ నూతన కార్యవర్గం

కొవ్వూరు: రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) మండల శాఖ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కేవీ చల్లాజీరావు, ప్రధాన కార్యదర్శిగా వీఎస్ఎం లూథర్, మహిళా కార్యదర్శిగా ఎ.పద్మ, మహిళా కన్వీనర్‌గా ఎస్.వసుంధర, జిల్లా కౌన్సిలర్‌గా కేఎస్ఆర్ ఆంజనేయులు, కోశాధికారిగా కేవీడీ శ్రీనివాసులును ఎన్నుకున్నారు. ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తగ్గించాలని, టీచర్‌లను కేవలం బోధనకే పరిమితం చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను తక్షణమే ఇవ్వాలని, 12వ పీఆర్‌సీని ప్రకటించాలని నూతన అధ్యక్షుడు చల్లాజీరావు డిమాండ్ చేశారు.

ఆంజనేయస్వామి గ్రామోత్సవం

చాగల్లు: హనుమత్ వ్రత మహోత్సవాల్లో భాగంగా చాగల్లు భక్తాంజనేయ స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు, గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ పురోహితుడు శివసీతారామశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి పలురకాల పండ్లు, పుష్పాలతో సహస్ర నామార్చన, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని గ్రామ వీధుల్లో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మట్టి తరలిస్తున్న టిప్పర్లు, జేసీబీ స్వాధీనం




పోలీసు స్టేషన్ వద్ద స్వాధీనం చేసుకున్న టిప్పర్లు, జేసీబీ

నల్లజర్ల: అనుమతి లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్న ఐదు టిప్పర్లు, ఒక జేసీబీని రెవెన్యూ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకొని నల్లజర్ల పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఆవపాడు రెవెన్యూ పరిధిలోని ప్రకాశరావుపాలెంలోని ఓ రైతు పొలం నుంచి టిప్పర్ల ద్వారా మట్టి అక్రమ రవాణా జరుగుతోంది. దీనిపై సమాచారం అందుకున్న వీఆర్వో సంఘటనా ప్రాంతానికి వెళ్లి ఆ వాహనాలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. దీనిపై మైనింగ్ శాఖకు ఫిర్యాదు చేసినట్టు తహసీల్దారు కృష్ణారావు తెలిపారు.

స్థలాలు ఇచ్చారు.. పట్టాలు మరిచారు

యర్నగూడెంలో లబ్ధిదారుల ఆవేదన



యర్నగూడెంలో పేదలకు ఇచ్చిన జగనన్న కాలనీ స్థలాలను పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శివజ్యోతి, తహసీల్దార్ రాజ్యలక్ష్మి

దేవరపల్లి: ఇళ్లస్థలాలు ఇచ్చిన అధికారులు పట్టాలు జారీ చేయడం మరిచారని యర్నగూడెం పేదలు ఆవేదన వ్యక్తం చేశారు. యర్నగూడెం గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ బొంతా భతర్‌బాబు అధ్యక్షతన బుధవారం గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామస్తులు పలు సమస్యలను అధికారులకు వివరించి అర్జీలు అందజేశారు. రెవెన్యూ సదస్సుల ప్రత్యేకాధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శివజ్యోతి, తహసీల్దార్ కె. రాజ్యలక్ష్మి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. గుండుగొలను–కొవ్వూరు జాతీయ రహదారి విస్తరణకు భూమిని సేకరించిన ప్రభుత్వం సర్వే నెంబరులోని మొత్తం భూమి ఆన్‌లైన్‌లో రెడ్‌మార్కు (22ఎ)లో ఉందని రైతులు వివరించారు. తమ సొంత భూములను కూడా రెడ్ మార్కులో ఉంచడం వల్ల ప్రభుత్వ రాయితీలు, బ్యాంకు రుణాలు కోల్పోతున్నామని తెలిపారు. భూములను రెడ్ మార్కు నుంచి తొలగించి తమ పేరున ఆన్‌లైన్ చేసి పట్టాదార్ పాస్ పుస్తకాలు, 10/1 అడంగల్‌లో మార్పు చేయాలను అధికారులను వారు కోరారు. నిడదవోలు–యర్నగూడెం రోడ్డులోని సబ్‌స్టేషన్ సమీపంలో రోడ్డు పక్కనే సుమారు 25 కుటుంబాలు పాకలు వేసుకుని జీవిస్తుండగా, 2018లో రోడ్డు విస్తరణ జరిగినపుడు వాటిని తొలగించి గ్రామకంఠంలో స్థలాలు ఇచ్చారని ఆయా కుటుంబాల వారు అధికారులకు వివరించారు. స్థలాలు ఇచ్చి ఆరేళ్లు పైబడినా ఇప్పటి వరకూ అధికారులు పట్టాలు ఇవ్వలేదని లబ్ధిదారులు తెలిపారు. స్థలాలను పరిశీలించి పట్టాలు అందజేసి, ప్రభుత్వ గృహాలు మంజూరు చేయాలని వారు కోరారు. అలాగే గ్రామంలోని 225 మంది పేదలకు గ్రామానికి దాదాపు ఐదు కిలోమీటర్ల దూరంలోని అనంతపల్లి ఎర్రకాలువ సమీపంలో జగనన్న కాలనీ స్థలాలు పంపిణీ చేసినట్టు లబ్ధిదారులు వివరించారు. గ్రామానికి దూరంగా ఉండడం వల్ల ఆ స్థలాలు నివాసయోగ్యంగా లేవన్నారు. ఆ స్థలాలను రద్దు చేసి గ్రామానికి సమీపంలో కొత్తగా స్థలాలు ఇవ్వాలని లబ్ధిదారులు కోరారు. దీంతో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శివజ్యోతి, తహసీల్దార్ కె. రాజ్యలక్ష్మి స్థలాలను పరిశీలించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని అధికారులు లబ్ధిదారులకు తెలిపారు. సదస్సులో 16 అర్జీలు వచ్చినట్టు తహసీల్దార్ రాజ్యలక్ష్మి తెలిపారు. మండల సర్వేయర్ దిలీష్, టీడీపీ నాయకుడు పెన్మత్స సుబ్బరాజు, వీర్వోలు ఎంబీ శంకరం, ఎస్‌కే షాన్‌బాషా, శేషమ్మ, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.